

బాలల పురస్కారాలకు దరఖాస్తుల గడువు పెంపు

శ్రీకాకుళం: జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 31వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించిందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జి.సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. పలురంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న 5 నుంచి 18 ఏళ్ల లోపు బాలల నుంచి ఈ దరఖాస్తులను స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర వాటిలో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్న బాలలు https://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'ఉపాధి' కూలీల పస్తులు

- మూడు నెలలుగా అందని డబ్బులు
- రూ.322 కోట్ల బకాయిలు
- ఆర్థిక ఇబ్బందుల్లో కూలీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వ్యవసాయ పనులు మొదలు కావడంతో ఉపాధి హామీ పనులు మందకొడిగా సాగుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో చెరువుల్లో నీరు చేరి ఉపాధి పనులకు అంతగా అవకాశం దక్కడం లేదు. దీంతో కూలీలు ఇంటి వద్దే ఉంటున్నారు. మరోవైపు పనులు చేసి మూడు నెలలు గడచినా ఆ డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చవిచూస్తున్నారు. ఉపాధి డబ్బులు అందక కూలీలు కటకటలాడుతున్నారు. పనుల్లేక, చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు పడుతున్నారు. పనిచేసినా డబ్బులు రాకపోవడంతో ఏం తినాలి?, ఎలా బతకాలంటూ కూలీలు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో రూ.322 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఈ సొమ్మును ఎప్పుడు విడుదల చేస్తుందా అని కూలీలు ఎదురుచూస్తున్నారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద జిల్లాలో 4,29,562 కుటుంబాలు నమోదు కాగా 3,34,755 కుటుంబాలకు ఈ సంవత్సరంలో ఇప్పటివరకు పని కల్పించారు. పనుల కోసం వ్యక్తిగతంగా 7,35,036 మంది నమోదు కాగా 5,01,090 మందికి పని చూపించారు. పనుల కల్పన వరకు కొంత బాగానే ఉన్నా డబ్బులు మాత్రం సకాలంలో చెల్లించడం లేదు. కూలీలకు రెండు రకాలుగా చెల్లింపులు చేస్తున్నారు. చెరువులు, కాలువలు వంటి తదితర పనులు చేసిన కూలీలకు చెల్లించే డబ్బులను వేజ్ పేమెంట్‌గా పరిగణిస్తారు. ఆర్‌బికె, సచివాలయాలు, గోకులాలు, రోడ్లు వంటి పనులకు మెటీరియల్ వేజెస్‌గా చెల్లిస్తారు. ఈ రెండు కేటగిరీల్లోనూ పెద్దఎత్తున బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా రూ.322.24 కోట్ల పైనే పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఒక్క మెటీరియల్ కాంపోనెంట్ కూలి డబ్బులు రూ.203.65 కోట్ల బకాయిలు ఉన్నాయి. వేజ్ కాంపోనెంట్ కింద రావాల్సిన డబ్బులు రూ.118.59 కోట్లు పెండింగ్ ఉన్నాయి. మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనులకు ఈ ఏడాది మే ఐదో తేదీ వరకు చెల్లించారు. వేజ్ పేమెంట్లకు సంబంధించి మే 20వ తేదీ వరకు చెల్లించారు. ఆ తర్వాత చేసిన పనులు డబ్బులు ఇవ్వలేదు.



పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు (ఫైల్ ఫొటో)

నిధులు విడుదల చేయని కేంద్రం

ఉపాధి హామీ పనులకు సంబంధించి కేంద్రం నిధులు విడుదల చేయకపోవడం వల్లే కూలీలకు చెల్లింపులు ఆగిపోయాయని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఇతర పథకాలకు వాడుకోవడంతో సకాలంలో కూలీలకు డబ్బులు అందడం లేదని కేంద్ర ప్రభుత్వమే ఆ బాధ్యత తీసుకుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేయడంతో కూలీలు మండిపడుతున్నారు.

కూలీల అగచాట్లు

ఉపాధి పనులు చేసినా సకాలంలో డబ్బులు రాకపోవడంతో కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పనిచేసిన డబ్బులతోనే కుటుంబాలను నెట్టుకొచ్చే కూలీలే అధిక శాతం ఉన్నారు. డబ్బులు అందక అయిన కాడికి అప్పులు చేస్తున్నారు. గ్రామాల్లో కిరాణా దుకాణాల వద్ద అప్పు చేసి సరుకులు తెచ్చుకుంటున్నారు.

బకాయిలు చెల్లించాలి



కూలీలకు సరిగా పనులు కల్పించలేని ప్రభుత్వం చేసిన పనికీ డబ్బులు చెల్లించకపోవడం దారుణం. ఉపాధి కూలీలకు కూలి డబ్బులే ఆధారం. మూడు నెలలుగా వారికి డబ్బులు ఇవ్వకపోతే ఎలా బతుకుతారు. ప్రభుత్వం వెంటనే కూలీలకు చెల్లించాల్సిన బకాయిల మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలి.

- గంగరాపు సింహాచలం, రాష్ట్ర ఉపాధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం

ఇబ్బందిగా ఉంది



వేసవిలో రెండు పూటలా ఉపాధి పనికి వెళ్లాను. నాకు పది వారాల డబ్బులు రావాలి. డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు. కూలి సొమ్ములు అందక చాలా ఇబ్బంది పడుతున్నాం. గ్రామంలో తెలిసిన వారి దగ్గర అప్పు చేసి సరుకులు తెచ్చుకుంటున్నాం. అధికారులను అడిగితే ఇదిగో, అదిగో అంటున్నారు

- కొర్రాయి బోడెమ్మ, ఇరపాడు

ఎలా బతకాలి..?



మే నెలలో ఉపాధి పనికి వెళ్లాను. నాకు ఏడు వారాల డబ్బులు రావాల్సి ఉంది. మూడు నెలలు అవుతున్నా డబ్బులు రాలేదు. నెలకు వచ్చే ఐదు కేజీల బియ్యం, ఉపాధి కూలీ డబ్బులతోనే బతుకుతున్నాను. డబ్బులు వస్తే బాకీ తీరుస్తానని చెప్పి మూడు నెలలుగా కిరాణా సామాన్లు అరువు తెస్తున్నాను. రోజూ ఎవరు అప్పులు ఇస్తారు. ప్రభుత్వం వెంటనే కూలి డబ్బులు ఇప్పించాలి.

- చింతాడ పగడాలమ్మ, మెట్టూరు



వినతిపత్రం అందజేస్తున్న ఎండిఎం నాయకులు, కార్మికులు

రాజకీయ వేధింపులు ఆపాలి

డిఇఒ కార్యాలయం వద్ద ఎండిఎం కార్మికుల ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర తెలిపారు. రాజకీయ వేధింపులతో తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడు మధ్యాహ్న భోజన పథకం కార్మికులను రాజకీయ కక్షసాధింపులతో తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోయినా, వడ్డీలకు అప్పులు చేసి మరీ పథకాన్ని నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. సుదీర్ఘకాలం పాటు వారి సేవలను వినియోగించుకున్న విద్యాశాఖ అధికారులు స్థానిక రాజకీయ కారణాలతో అర్థాంతరంగా నిలుపుదల చేయడం సరికాదన్నారు. తక్షణమే తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అన్యాయం జరగకుండా అధికారులే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.పద్మావతి, బి.విజయ, ఆర్.లక్ష్మి, ఎం.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి ఫర్మాన్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారిస్తానని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో జెసిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ప్రతి వారం డివిజన్, మండల స్థాయి పర్యటనలు చేపట్టి సమగ్ర స్వరూపాన్ని తెలుసుకున్న తర్వాత సమస్యల పరిష్కారంలో తనవంతు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనకు కలెక్టరేట్ ఉద్యోగులు సెక్షన్ల వారీగా కలసుకుని పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు సిహెచ్ రంగయ్య, భరత్ నాయక్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిపిఒ వెంకటేశ్వరరావు, డిఎస్‌ఒ శాంతిశ్రీ, రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీరాములు, బి.వి.ఎస్ రాజు, రాష్ట్ర కార్యదర్శి పప్పల వేణుగోపాల్, ఇతర నాయకులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పలు శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాజీ సైనికులను సత్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

యువత ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మన దేశాన్ని రక్షిస్తూ కార్గిల్‌లో అమరులైన వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్గిల్ యుద్ధంలో అంగవైకల్యం పొందిన ఇద్దరు మాజీ సైనికులను సన్మానం చేసి, నగదు పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 ఏప్రిల్‌లో కార్గిల్ యుద్ధంలో సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారని గుర్తుచేశారు. పాకిస్థాన్ దళాలు, తీవ్రవాదులు ఆక్రమించిన కార్గిల్‌లోని అన్ని సైనిక పోస్టులను తిరిగి స్వాధీనం చేసుకుని యుద్ధంలో విజయం సాధించారని తెలిపారు. అప్పట్నుంచీ ప్రతి ఏడాది జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో మాజీ సైనికులు, వారి కుటుంబాల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ వద్ద సిసి కెమెరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. అమరావతి నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని, రవాణా ఛార్జీలు మాత్రమే లబ్ధిదారుల నుంచి వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఇసుక నిల్వ పాయింట్ల వద్ద రవాణా ఛార్జీలను శాశ్వతంగా ప్రదర్శించాలని సూచించారు. ఇసుక రీచ్‌ల వద్ద ట్రక్కులను అందుబాటులో ఉంచాలని చెప్పారు. రవాణా ఛార్జీలను జిల్లాస్థాయి కమిటీ నిర్ణయించాలని చెప్పారు. భూగర్భ గనులశాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ జిల్లాలవారీగా ఇసుక నిల్వ, వార్షిక డిమాండ్ కార్యాచరణ ప్రణాళిక, రీచ్‌ల గుర్తింపు, రవాణా ఛార్జీలు తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్టాక్ యార్డులో ప్రస్తుతం 46 వేల టన్నుల ఇసుక నిల్వ ఉందని, డీసిల్టింగ్ త్వరలోనే చేస్తామన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిటిసి చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌ఇబి ఎఎస్‌పి గంగాధరం, మైన్స్ ఎడి ఫణిభూషణ్ రెడ్డి, ఉప కలెక్టర్లు అప్పారావు, సుదర్శన్ దొర తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో కౌన్సెలింగ్ ప్రక్రియ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. కౌన్సెలింగ్ ప్రక్రియకు వంద స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ముందస్తు ఏర్పాటులో భాగంగా విద్యార్థులకు టోకెన్ ఇచ్చి కౌన్సెలింగ్ కేంద్రానికి అనుమతించారు. కుల ధ్రువీకరణ, అకడమిక్ పత్రాల తనిఖీ, ఫీజు చెల్లింపు సమాచారం ఆన్‌లైన్‌లో ఆప్షెన్ లో పొంధు పరచడం సర్టిఫికెట్స్ సేకరణ చేసి విద్యార్థులు ప్రవేశాలు కల్పించారు. ఆర్‌జియుకెటి అడ్మిషన్స్ కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, కోఆర్డినేటర్ గోవర్ధనరావు, రమణ తదితరులు ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ సాగుతుందని తెలిపారు. మిగులు సీట్లను మెరిట్ ప్రకారం ఆగస్టు మొదటి వారంలో రెండో విడత కౌన్సిలింగ్‌లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు.



ధ్రువపత్రాలు అందజేస్తున్న డైరెక్టర్ బాలాజీ

రేపు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఆరోజు ఉదయం పది గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం పది గంటలకు 2వ స్థాయి, 11 గంటలకు 4వ స్థాయి, మధ్యాహ్నం 12 గంటలకు ఒకటో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు 7వ స్థాయి, మూడు గంటలకు 6వ స్థాయి, సాయంత్రం నాలుగు గంటలకు 3వ స్థాయి, ఐదు గంటలకు 5వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

స్కానింగ్ సెంటర్లపై నిఘా

- లింగ వివక్ష రూపుమాపే చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. భేటీ బచావో - భేటీ పడావో జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ వివక్ష రూపుమాపే చర్యలు చేపట్టాలన్నారు. బాలికల విద్యకు ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావును ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో పాలిచ్చే తల్లులకు ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆడపిల్లల జననాలు తక్కువగా ఉన్న ఆస్పత్రులపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని డిఎంహెచ్ఒ బి.మీనాక్షిని ఆదేశించారు. సుకన్య సమద్ధి యోజన బ్యాంకు అకౌంట్లు గురించి పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఎల్‌డిఎం సూర్యకిరణ్‌కు సూచించారు. బాలికల ఉన్నత విద్యకు ఎలాంటి పూచీ లేకుండా రూ.ఏడు లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాల బాలికలకు లింగ సమానత్వాన్ని గుర్తించే విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాలు నివారించేందుకు బాలికలు వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేలా అవగాహన కల్పించాలన్నారు. శాఖల వారీగా బాలికల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. విద్యా ఫౌండేషన్స్ ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ నాబార్డు సహకారంతో గ్రామీణ ప్రాంత యువతులకు వత్తి నైపుణ్యం మరియు ఉపాధికల్పనా కార్యక్రమాలను నిర్వహించాలని బ్యాంకు రుణాల ద్వారా వ్యవస్థాగత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, బాలల సంరక్షణ అధికారి రమణ, సిఎఒ లక్ష్మీప్రసన్న, ఆర్‌ఐఒ దుర్గారావు, సమగ్ర శిక్ష ఎసిపి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం దృష్టికి నియోజవర్గ సమస్యలు

ప్రజాశక్తి - ఆమదాలవలస



చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న రవికుమార్

ఆమదాలవలస నియోజకవర్గంలో ఐదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. అమరావతి లోని సచివాలయంలో సిఎంను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వంశధార - నాగావళి నదుల అనుసంధాన పనులతో పాటు పొందూరు మండలంలోని రెల్లిగెడ్డ పనులను వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, వీటిని ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. నియోజకవర్గంలో పలు రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు పూర్తిస్థాయి వసతితో పాటు ప్రభుత్వ ఐటిఐ ఇంజినీరింగ్ కళాశాల, పరిశ్రమను ఏర్పాటు చేయాలని చేయాలని కోరారు. ఇ-సేవ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా పారిశ్రామిక ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి గల అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్ఎంఇ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో ఇస్తున్న అనుమతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిలో ఫార్మా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో పొందుతున్న ఉపాది అవకాశాలను జిల్లా పరిశ్రమల కేంద్రం ఎడి రమణరావు వివరించారు. పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పనకు ఎపిఐఐసి చేపడుతున్న కార్యక్రమాలను డిప్యూటీ జోనల్ మేనేజర్ పాండురంగారావు వివరించారు. డిఐపిసిలో 41 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో తిరస్కరణకు గురైన వాటితో పాటు అనుమతులు పెండింగ్‌లో ఉన్న కారణాలతో పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పిఎం విశ్వకర్మ పథకం ద్వారా ఇప్పటివరకు 7,138 దరఖాస్తులు పరిశీలించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి జె.ఉమామహేశ్వరరావు, ఎడిలు రమణారావు, రఘునాథ్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, ఎపిఎంఐపి డీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ పరేడ్‌లో పాల్గొన్నారు. ఆర్మ్‌డ్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించి అనంతరం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అంకితభావంతో క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించి మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, అలాంటప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమన్నారు. సిబ్బందికి ఎటువంటి సమస్యలు ఉన్నా దృష్టికి తీసుకురావాలని, సాధ్యాసాధ్యాలు బట్టి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం పలువురు సిబ్బంది వారి వ్యక్తిగత, ఉద్యోగ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్, డిఎస్‌పిలు ఎల్.శేషాద్రి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- పలాస

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టర్ పారిశుధ్య కార్మికులకు రూ.36 వేలు వేతనం చెల్లించాలని పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు సిహెచ్ మురుగన్, డి.శ్రీనివాస్, పి.రాజ్ కిషోర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ టి.నాగేంద్ర కుమార్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చనిపోతే వారి ఇంట్లో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు పనిచేసే చోట తాగునీరు, బట్టలు మార్చుకునేందుకు గదులను అన్ని పంచాయతీల్లో ఏర్పాటు చేయాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు, ఇతర సంస్థల్లో పనిచేసే కార్మికులకు గౌరవ ప్రదమైన నివాసాలు ఏర్పాటు చేయాలని, వారి పిల్లలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులను పెంచాలన్నారు.


మాట్లాడుతున్న జడ్జి మాధురి

హెల్మెట్ తప్పనిసరి

పలాస: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద హెల్మెట్ వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటిసారి హెల్మెట్ లేకుండా పట్టుబడితే ఒక రకమైన అపరాధ రుసుం వేస్తారని, రెండోసారి పట్టుబడితే ఇంకోరకమైన అపరాధ రుసుం వేయడం జరుగుతుందన్నారు. అపరాధ రుసుం చెల్లించే ఆలోచన నుంచి బయట పడాలన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్. విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఫయాద్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్ రాజు, బికెఆర్ పట్నాయక్, కోత రజనికుమార్, ప్రభాకర్, రవికుమార్, శ్యామ్, చిట్టిబాబు, డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విలియమ్స్

విద్యతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

కాలానుగుణంగా జరిగే మార్పుల్లో భాగంగా క్రీడల్లో కూడా మార్పులు రావాలని టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. మండలంలోని ప్రణవి జూనియర్ కాలేజీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన డివిజన్‌స్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల ఓరియంటేషన్ శిక్షణా తరగతి సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలను అభివృద్ధి పర్చాలన్నారు. జిల్లా వ్యాయామ విద్య అధ్యక్షులు ఎం.వి.రమణ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించబోయే క్రీడలు మూడంచెల విధానంలో నిర్వహించ నున్నామన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బి.వి.రమణ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించబోయే క్రీడల విధివిధానాలతో పాటు క్రీడల షెడ్యుల్‌ను వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు దాసుపురం చిన్నారావు, సిహెచ్ ఫణికుమార్, జిల్లా క్రీడాశాఖాధికారులు మాధవరావు, కె.రాజారావు, పి.తవిటయ్య, ఎం.తిరుపతిరావు, కుప్పిలి ప్రకాష్, జి.శ్రీనివాసరావు, హరిబాబు, నారాయణరావు, రాజాతో పాటు డివిజన్‌లోని పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా శాంతి

ఎచ్చెర్ల : సావిత్రిబాయి పూలే పేరుతో డా.బిఆర్‌ఎయులో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా అధ్యయన కేంద్రం తొలి డైరక్టర్‌గా వర్శిటీ తెలుగు విభాగం అధ్యాపకులు డా.ఉమ్మడి శాంతి నియమితులయ్యారు. ఈ మేరకు వర్శిటీ విసి ఆచార్య కె.ఆర్.రజని నియామక ఉత్తర్వులను శాంతికి శుక్రవారం అందజేశారు. మాతృమూర్తిగా, మార్గదర్శిగా డా.అంబేద్కర్ భావించే సావిత్రి బాయ్ పూలే పేరును వర్శిటీ మహిళా అధ్యయన కేంద్రానికి నామకరణం చేయడం జరిగిందని, మహిళా సంబంధిత అంశాలు అధ్యయనానికి ఈ కేంద్రం పెద్దపీట వేయాలని విసి సూచించారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఆర్ట్స్ కళాశాలలో 1969- 72 బ్యాచ్ బిఎస్‌సి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం హెూటల్ గ్రాండ్‌లో శుక్రవారం నిర్వహించారు. 52ఏళ్ల తర్వాత నాటి విద్యార్థులంతా ఒక చోటకు చేరి ఆనందాన్ని పంచుకున్నారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ప్రస్తుత స్థితిగతులను పంచుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ పిండి నాగేశ్వరరావు, నిర్వాహకులు ఎం.ప్రభాకరరావు, డి.సన్యాసిరావు, బి.చిరంజీవిరావు, ఎం.రామచంద్రరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'ఐతమ్'లో పట్టభద్రుల దినోత్సవం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 8వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఈనెల 27న శనివారం నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పట్టభద్రుల దినోత్సవం సందర్భంగా 2023-2024 విద్యా సంవత్సరంలో బిటెక్, ఎంబిఎ కోర్సులు పూర్తిచేసిన 500 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అతిథుల చేతులమీదుగా అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు సదస్సు

టెక్కలి: టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు పరిధిలో స్థానిక ఎస్‌విఆర్‌కె జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం మాదకద్రవ్యాల వినియోగం, నష్టాలు, యువత పాత్ర అనే ఆంశంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించనున్నామని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు జరిగే ఈ సమావేశంలో మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా జరగబోయే నష్టాల్లో విద్యార్థులు, యువత ఏ విధంగా బలికాబడుతున్నారనే అనే అంశాలపై, చట్టాలపై అవగాహన ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

కార్గిల్ వీరుల త్యాగాలు యువతకు ఆదర్శం

జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి శైలజ


రక్తదాతలకు సర్టిఫికేట్లు అందజేస్తున్న డోల జగన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

కార్గిల్ వీరుల త్యాగాలు యువతకు ఆదర్శనమని జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఎం. శైలజ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మాజీ సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు, మాజీ సైనికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సైనికులంతా సమిష్టిగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్, ఎమ్మెల్యే కూన రవి సతీమణి ప్రమీల, గొండు శంకర్ సతీమణి స్వాతి, ఎన్.ఈశ్వరరావు తనయుడు తేజబాబు, మాజీ సైనికుల జెఎసి ప్రతినిధులు పైడి రామారావు డి.సాంబశివరావు ఎస్.నారాయణమూర్తి పాల్గొన్నారు.

కవిటి: కార్గిల్ దివస్ వేడుకలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కల్యాణి ఆంగ్ల పాఠశాల, ఎస్‌విజె, బివికె పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విశ్రాంత ఆర్మీ జవాన్ బి.జయకృష్ణను పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ కార్గిల్ పోరాటంలో సరిహద్దులో దేశం కోసం పోరాడడం ఒక మధురానభూతి కలిగిస్తే, మనం భారతీయులుగా జన్మించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల హెచ్‌ఎం బెండాలం మల్లేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక మాజీ సైనికులు సంక్షేమ సంఘం కార్యాలయం, జ్ఞానభారతి విద్యా సంస్థలో ఘనంగా కార్గిల్ దివస్ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళ్లర్పించారు. స్వర్ణ భారతీ విద్యా సంస్థల చైర్మన్ ఛాట్ల తులసీ దాస్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, బిల్ నారాయణ, డి.విశ్వనాథ్‌రెడ్డి, యు. శంకర్, పి.మహదేవ్‌రెడ్డి, జి.ఢిల్లీష్, సాహు, దుర్గయ్య, జగన్నాద్, చంద్రశేఖర్, మాజీ సైనుకులు, జ్ఞానభారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్, ట్రష్టి వజ్రపు రమణ మూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అలీం ఖాన్, పిఒటిలు కైలాష్ పండా పాల్గొన్నారు.


కవిటి : జయకృష్ణని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది


ఇచ్ఛాపురం : నివాళ్లర్పిస్తున్న మాజీ సైనికులు

కొత్తూరు: నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కార్గిల్ దివాస్ సందర్భంగా రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో నివగాం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగి నిలురోతు ఆనందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు


మెళియాపుట్టి : తహశీల్దార్ జానకమ్మను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా అధికారులకు బదిలీలు సర్వసాధారణమని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్‌ఎస్‌విఎస్ నాయుడు, ఆర్‌డిఒ కార్యాలయంలో పనిచేస్తున్న ఎఒ కె.సూర్యనారాయణ బదిలీపై సొంత జిల్లాకు వెళ్ళిపోవడంతో శుక్రవారం వారికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తహశీల్దార్ ఎస్‌ఎస్‌విఎస్ నాయుడు, ఎఒ కె.సూర్యనారాయణ సమర్థవంతంగా పని చేశారని కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి మంచి సేవలు అందించారన్నారు. అనంతరం తహశీల్దార్ నాయుడు, ఎఒ సూర్యనారాయణ మాట్లాడుతూ పలాస వంటి ప్రాంతంలో పని చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి అధికారి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమకు సహకరించారని, ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి నారాయణ, పైల వెంకటేశ్వరరావు, అరుణ, జీవన్, ఆర్ఐ నిరంజన్, సంతోష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండల ప్రజలు, తోటి సిబ్బంది ఆదరణ మరువలేనిదని తహశీల్దార్ ఎం.సురేష్ అన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలానికి వచ్చిన ఆయన శుక్రవారం బదిలీపై సొంత జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, డీలర్లు, కార్యాలయ సిబ్బంది ఆయనను దుశ్శాలువ, మోమెంటూ ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు సజావుగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించారన్నారు. డిటి వి.గిరిరాజ్, ఆర్ఐ పవిత్ర, సర్వేయర్ తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ బాబీ, రెవెన్యూ అధికారులు తిరుమల రావు, వెంకటరావు, డీలర్లు తవిటయ్య, కామేశ్వరరావు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక తహశీల్దార్ వైఎస్‌వివి ప్రసాదరావుకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన విశాఖ జిల్లా నుంచి ఎన్నికల నేపథ్యంలో పాతపట్నంకు బదిలీపై వచ్చారు. ఎక్కడ పనిచేసారో అక్కడికే పోస్టింగులు ఇస్తూ ఆదేశాలు జారీ చేయడంతో విశాఖ జిల్లాకు బదిలీపై వెళ్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఇటీవల ఎన్నికల దృష్ట్యా విశాఖపట్నం నుంచి ఇక్కడకు వచ్చిన తహశీల్దార్ కె.జానకమ్మ గత ఆరు నెలలుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయినా నేపథ్యంలో తహసిల్దార్ జానకమ్మకు స్థానిక రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిటి వాన శంకరరావు, రీసర్వే డిటిడి శ్రీనివాసరావు ఎఎస్‌ఒ మనోహర్, సీనియర్ అసిస్టెంట్ ఎస్. కృష్ణారావు, రంజిత్ కుమార్, విఆర్‌ఒలు శ్రావణ్ కుమార్, పాడి అప్పలనాయుడు, అన్నాజీరావు, హిమగిరి పాల్గొన్నారు.

నందిగాం: విజయనగరం జిల్లా నుంచి మండల తహశీల్దార్ బాధ్యతలు చేపట్టిన వి.పద్మావతి మరలా విజయనగరం జిల్లాకు బదిలీ కావడంతో ఆఫీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి ఎంఆర్ఐ పి.కిరణ్, విఆర్‌ఒ ఈశ్వరరావు పాత్రో, జగదీశ్వరరావు, సీనియర్ సహాయకులు సింహాచలం ఉన్నారు.


పలాస : ఎఒకు సన్మానం చేస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్


వజ్రపుకొత్తూరు : తహశీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తిత్లీ బాధితులకు న్యాయం చేయాలి

కవిటి: 2018లో సంభవించిన తితిలి తుఫానుకు నష్టపోయి ఇప్పటికీ పరిహారం అందని సుమారు 7వేల మందికి న్యాయం చేయాలని కవిటి, కంచిలి మండలాలకు చెందిన పలువురు రైతు ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే అశోక్‌తో కలిసి శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుని అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. పలు సాంకేతిక కారణాలు చూపుతూ సుమారు 7వేల మందికి పరిహారం నిలిపివేశారని వీరు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సిఎం దృష్టికి బాధితుల సమస్య తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, బెండాలం రమేష్, మాదిన రామారావు, లోల్ల శ్రీను, పుల్లట సంతోష్, బెండాలం విజయ్‌కుమార్, పుల్లట రాజు, సంతోష్ పట్నాయక్, టివి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

కంచిలి: రాష్ట్రంలో మిగిలి ఉన్న ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని టిడిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మఠిపాటి పూర్ణచంద్రుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం అమరావతిలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిలుపుదల చేసిన పథకాలను తిరిగి కొనసాగించాలని, ఎస్‌సి కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు కంచిలి మండలం టిడిపి నాయకులు పాల్గొన్నారు.


కంచిలి : అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పూర్ణచంద్రుడు

నేడు రణస్థలం మండల సమావేశం

ప్రజాశక్తి- రణస్థలం

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు తమ పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు. చాలా మంది అధికారులు హజరు కావడం లేదని, ముఖ్యమైన పనులు ఉంటే ముందుగా సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇవ్వకుండా గైర్హాజరయితే కలెక్టర్ నోటీసులో పెట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెవెన్యూ అక్రమాలపై నిలదీత

ప్రజాశక్తి- పోలాకి

ఇళ్ల పట్టాలు మంజూరులో రెవెన్యూ అధికారులు చేసిన అక్రమాలపై పోలాకి, నరసాపురం యువజన సంఘం సభ్యులు నిలదీశారు. శుక్రువారం గ్రామ సచివాలయం, తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి రెవెన్యూ అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసాపురం వద్ద ఇటీవల మంజూరు చేసిన జగనన్న లే అవుట్‌లో చాలా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. విఆర్‌ఒ, డిటి కలిసి అక్రమాలకు పాల్పడ్డారని, గ్రామంలో అర్హులకు ఇవ్వకుండా పక్క గ్రామాల వారికి మంజూరు చేసారన్నారు. అలాగే కొందరికి ఎటువంటి పట్టాలు ఇవ్వకుండా గుట్టు చప్పుడు కాకుండా కట్టుకోమని ఆదేశాలు ఇవ్వడం వెనుక ముడుపులు ఎంత అందాయో అర్థం అవుతుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై నెలరోజుల నుంచి రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. అలాగే ఇందిరానగర్ కాలనీలో నీళ్ల ట్యాంకు ఆవరణలో 126 సర్వే నెంబర్‌లో రోడ్డుకు ఆనించి ఉన్న స్థలం కూడా గుట్టుచప్పుడు కాకుండా ఎవరకో ఇచ్చాశారని ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయకపోతే సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు.


విఆర్‌ఒను నిలదీస్తున్న యువజన సంఘం సభ్యులు

జీడి గోదాములో జిఎస్‌టి అధికారుల సోదాలు


గోదాములో సోదాలు చేస్తున్న జిఎస్‌టి అధికారులు

ప్రజాశక్తి- పలాస

పలాసలోని జీడి వ్యాపారి (ఎక్సెంట్ కాష్యూ సప్లయర్స్) ఎస్.శ్రీనివాసరావు గోదాముపై శుక్రవారం విజయనగరం జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారుల బృందం సోదాలు నిర్వహించారు. ఈ దాడులు గురువారం చేయాల్సి ఉండగా సంబంధిత యజమాని శ్రీనివాస్ వేరే ప్రాంతానికి వెల్లడంతో అధికారులు ముందస్తు నోటీసులు ఇచ్చి దాడులు నిర్వహించారు. అయితే గొదాములో కేవలం 750 కిలోల జీడి పప్పు మాత్రమే ఉన్నట్లు గుర్తించి దానికి సంబంధించిన ప్రాథమిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ విలేకర్లతో మాట్లాడుతూ సాధారణ తనిఖీలు చేశామని స్పష్టం చేసారు. ప్రతిఏటా జీడి వ్యాపారసంస్థల రికార్డులు పరిశీలించాల్సి ఉంటుందని వివరణ ఇచ్చారు. అయితే బ్రోకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా దాడి చేశారని ఆరోపించారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరి నెలలో కాశీబుగ్గ జిఎస్‌టి కార్యాలయంలో జిఎస్‌టి ఎసిటిఒ స్థాయి అధికారి కిషోర్‌కుమార్ ఎసిబి దాడిలో బుక్కయ్యారు. బ్రోకర్ శ్రీనివాస్‌కు సంబంధించి రూ.18 లక్షల నగదు వ్యాపారి అకౌంట్‌కు రావాల్సి ఉంది. దీనికి భారీ మొత్తం డిమాండ్ చేయడంతో వాటిని ఇచ్చేందుకు ఇష్టం లేని శ్రీనివాస్ ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో పక్కా ప్రణాళికతో జిఎస్‌టి అధికారి కిషోర్‌కుమార్‌ను పట్టుకున్నారు. ఈ క్రమంలో జీడి బ్రోకర్ శ్రీనివాస్‌పై అప్పటి నుంచి జిఎస్‌టి అధికారులు వేధించడంతో పాటు కేసు విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిళ్లు తీసుకు వస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ఆయనకు చెందిన కార్యాలయంపై సోదాలు జరపడం సర్వత్రా ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై వ్యాపారులు కూడా జీఎస్‌టి అధికారుల తీరుపై మండిపడుతున్నారు. తమతో పెట్టుకుంటే పరిస్థితి ఇదే విధంగా ఉంటుందనే హెచ్చరికలు అధికారులు ఇస్తున్నారా అనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే అధికారులు మాత్రం ఇది సాధారణ తనిఖీలే అని చెబుతుండడం విశేషం.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం, పర్లాకిమిడి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో నిఘా పెంచామని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ అన్నారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్ జరుగుతుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒరిస్సా రాష్ట్రమైన పర్లాకిమిడి నుంచి ఆంధ్రాకు వచ్చే ప్రతిఒక్క వాహనాన్ని నిశితంగా పరిశీలించి తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి, పొగాకు ఉత్పత్తులైన టువంటి నిషేధిత ఉత్పత్తులను ఎవరైనా తరలించినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. శుక్రవారం తన సిబ్బందితో చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శి సతీష్‌బాబుపై విచారణ


విచారణ చేస్తున్న జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.లక్షలు వసూలు చేశారన్న అభియోగాలపై మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శి మన్నెం సతీష్‌బాబుపై జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావుతో పాటు నలుగురు సభ్యులతో కూడిన బృందం జెడ్‌పి కార్యాలయంలో శుక్రవారం విచారణ చేపట్టారు. జిల్లాలోని కవిటి, మందస, టెక్కలి, శ్రీకాకుళం, మెళియాపుట్టి మండలాలతో పాటు ఏలూరు జిల్లా నుంచి ముగ్గురు బాధితులు జెడ్‌పి కార్యాలయానికి చేరుకున్నారు. ఈనెల 22న 'మీకోసం'లో ఫిర్యాదు చేసిన ఏడుగురు ఫిర్యాదుదారులకు నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని అధికారులు పిలిచారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ నియామకాలు, ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా వాహనాల మంజూరు, తాత్కాలిక అవసరాల కోసం ఇతర ధ్రువీకరణ పత్రాల నమోదు వంటి కారణాలతో వీరి వద్ద రూ.లక్షల్లో తీసుకున్నట్లు బాధితులు తమ్మినేని లీలాకృష్ణ వివరించారు. తనకు అమరావతిలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.15 లక్షల నగదు తీసుకున్నారని వివరించారు. బాధితులు తమ్మినేని సాయి, పి.నరేష్ కుమార్, జయలక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం పూర్తి నివేదికలను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు తెలిపారు.



ఆటో బోల్తా : వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పాతపట్నం


మృతిచెందిన గోపి

స్థానిక శివశంకర్ కాలనీ సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో గురువారం రాత్రి ఆటో బోల్తా పడి బచ్చల గోపి (37) మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు సారవకోట మండలా నికి చెందిన బచ్చల గోపి గత కొన్నేళ్లుగా పాత పట్టణంలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి పాతపట్నంలోని శివశంకర్ కాలనీ నుంచి పర్లాకిమిడి వైపు ఆటోతో వెళుతుండగా కుక్కలు అడ్డు రావడంతో వాటిని తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తా పడి అక్కడకక్కడే మృతిచెందాడు. మృతుడు గోపికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పూజ

మేడపై నుంచి జారిపడిన విద్యార్థిని

కోటబొమ్మాళి: స్థానిక కస్తూరిభాగాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వడ్డాపు పూజ ప్రమాదవశాత్తు గురువారం రాత్రి మొదటి అంతస్తు నుంచి కాళ్లు జారి కింద పడి పోయింది. దీంతో పూజను పాఠశాల ఉపాధ్యా యులు, సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. వైద్యులు చికిత్స అందించి పూజ కాలు విరిగిందని ఇక్కడ ఎక్స్‌రే సదుపాయం లేనందున శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి పూజ తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం మెడికవర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.


ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- నందిగాం

మండలం పెద్ద లవునిపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు మండలం హుకుంపేటకు చెందిన చిన్ని వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు పెట్రోల్ బంకుకు వెళ్తుండగా పలాస నుంచి అదే రహదారిపై వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వెంకటేశ్వరరావును హైవే అంబులెన్స్ సహాయంతో టెక్కలిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. హెచ్‌సి బి.ఢిలేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ

టెక్కలి రూరల్: టెక్కలి పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం అర్చకులు ఉదయాన్నే ఆలయానికి వెళ్లి చూసేసరికి తలుపులు తీసి ఉండటంతో నగదు, గంట చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బాధితులను పరామర్శిస్తున్న సర్పంచ్ జోగారావు

అగ్ని ప్రమాదంలో రెండిళ్లు దగ్ధం

సోంపేట: మండలం పలసపురంకు చెందిన సంక రామారావు, బడ్డి బైరాగిలకు చెందిన రెండు పూరిళ్లు శుక్రవారం ఉదయం దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు ఇంట్లో జరిగిన విద్యుత్ సార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రెండు ఇళ్లతో పాటు పక్కనే ఉన్న రెండు పశువుల పాకలు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ తడక జోగారావు సందర్శించి బాధితులను పరామర్శించారు. నిరుపేదలైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నాటుసారా స్వాధీనం

మెళియాపుట్టి: మండలంలోని సవర మఠిపాడులో సెబి ఎన్‌ఫోర్స్‌మెంట్ టెక్కలి బృందాలు పలాస డిటిఎఫ్ సిబ్బంది సారాతయారీ స్థావరాలపై శుక్రవారం సంయుక్త దాడులు నిర్వహించారు. టెక్కలి సిఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయగా, 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలకు నాటుసారా తయారీ వలన కలిగే నష్టాలను తెలియజేశారు. సారాతయారీ మానుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో సెబి సిఐ జి.రాజశేఖర్ నాయుడు, డిటిఎఫ్ సిఐ పి.రామచంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఇబి అధికారుల విస్తృత తనిఖీలు

కొత్తూరు: ఎస్‌ఇబి ఎస్ఐ శ్రావణి ఆధ్వర్యంలో శుక్రవారం గంజాయి అక్రమరవాణాపై క్రాంతి, ఎస్‌ఆర్‌ఎంటి, నవత ట్రాన్స్‌ఫోర్ట్ కార్యాలయాల్లో విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. అలాగే వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి రవాణా చేసి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎవరైనా అక్రమంగా గంజాయి పార్శిల్ చేస్తే పార్శిల్ యజమాని, బుకింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈమెతో పాటు ఎస్‌ఇబి సిబ్బంది ఉన్నారు.


క్రాంతి ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రావణి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎన్ఇఆర్

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సిబ్బంది కొరత

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. అమరావతిలో శుక్రవారం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఖరీఫ్‌లో రైతులు పొలాల్లో పనిచేస్తుంటారని, పాముకాటుకు గురవుతుంటారని, పాముకాటుకు, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన మౌలిక సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు.


ఇఎంటిలతో 108 అధికారులు

మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ

ప్రజాశక్తి- పలాస

స్థానిక సామాజిక ఆస్పత్రి ఆవరణంలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణలో ఇఎంటిలకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యుల్ అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఎఇఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఒఇ జగన్నాథరావు పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ తరగతులు నిర్వహించారు. అత్యవసర, రైల్వే మెడికల్ వైద్య సేవలు వివరిస్తూ ఇటువంటి పరిస్థితుల్లో ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలి, ఎటువంటి మందులు ఇవ్వాలనే వాటిపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్‌లో పనిచేస్తున్న 30 మంది ఇఎంటిలు శిక్షణ పొందారు.

వ్యవసాయ రంగంపై కేంద్రం నిర్లక్ష్యం

ప్రజాశక్తి- పలాస

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమైందని అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత లేకుండా చేసిందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు ఒట్టి మాటలేనని, కార్పొరేటర్లకు వరాలజల్లు కురిపించిందని విమర్శించారు. కీలక వ్యవసాయ రంగంలోనూ కార్పొరేటర్లకే పెద్దపీట వేసిందని ఆరోపించారు. ఉత్తరాది నుంచి రైతాంగం ఢిల్లీని నిర్బంధించి అనేక ఉద్యమాలు చేస్తే స్వయంగా మోడీయే దిగివచ్చి రైతుల సమస్య పరిష్కరిస్తామని, రైతు పండించే పంటల గిట్టుబాటు ధరలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. రైతాంగానికి ఇచ్చే అరకొర ఎరువులను, పురుగుమందుల సబ్సిడీలు పూర్తిగా ఎత్తి వేసారన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నీరుగార్చుతున్నారని, ప్రజలకు ఆహార భద్రత సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలులో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు.


పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలో పొలం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన తేలికపాటి వర్షలతో పాటు వంశధార నీరు రావడంతో శివారు ప్రాంతాల్లో రైతులు సాగుకు సమాయత్తం అవుతున్నారు. శుక్రవారం పంట పొలాల్లో రైతులు, రైతు కూలీల హడావుడి కనిపించింది. ఎన్నో ఏళ్ల తరువాత సకాలంలో ఉబాలు వేస్తున్నామని రైతులు ఆనందంగా చెబుతున్నారు. రైతు కూలీల సమస్య వేధిస్తుందని సీతాపురానికి చెందిన రైతు బమ్మిడి చలపతిరావు అవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు మేలు కలుగుతుందన్నారు.


రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ చెల్లంనాయుడు

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతుల అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని చీమలవలస సర్పంచ్ సనపల చెల్లం నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని చీమలవలసలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమానికి సిఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పేరిట పెట్టుబడి సాయం కింద ఏటా ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో రూ.20వేలు జమ చేయనున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను రైతుసేవా కేంద్రాల వద్ద తీసుకొని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు జనసేన సభ్యత్వ నమోదు

శ్రీకాకుళం అర్బన్: ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతే లక్ష్యంగా జనసేన పార్టీ ఆవిర్భవించిందని జనసేన నాయకులు, ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల్లో భాగంగా 100 మంది ఆటోడ్రైవర్లకు ఉచితంగా తన సొంత నిధులతో డాక్టర్ దానేటి శ్రీధర్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు ఛిన్నాభిన్నంగా మారిపోయి రాష్ట్రంలో యువత పరిస్థితి నిర్వీర్యమైందన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు చంద్రబాబు కలసి పవన్‌కళ్యాణ్ కూటమిని ఏర్పరిచి విజయాన్ని అందుకున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గురుప్రసాద్, కామేష్, గోపాల్ పండా, ఆటోడ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు వడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న దానేటి శ్రీధర్

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి


పాతపట్నం : ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- పాతపట్నం

ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, ఐదేళ్లలోపు పిల్లలను యాడ్ చేసుకోవడం తదితర ఆధార్ సంబంధిత పనుల కోసం ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న ఆధార్ కేంద్రాలను మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ రామకృష్ణరాజు అన్నారు. మండలంలోని గంగువాడ, పెద్దలోగిడి ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ప్రజలందరూ ఈ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పలాస: మండలం తర్లకోట ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు సందర్శించారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి 27 వరకు చేపడుతున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు పి.ఆనందరావు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార దిశగా గ్రామసభలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని పురుషోత్తపురంలో నిర్వహించిన గ్రామసభలో జనసేన మండల అధ్యక్షులు పైడి మురళీ మోహన్ పాల్గొని గ్రామ అభివృద్ధి అంశాలను ప్రస్తావించారు. కాలువలు, మంచినీరు, రోడ్డు, ఉపాధిహామీ పథకం తదితర అంశాలపై పరిష్కారం దిశగా స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి పనిచేస్తామన్నారు. నాయకుల ప్రమేయం లేకుండా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పైడి నరసింహులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మేజరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ గొండేల సుజాత అధ్యక్షత గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల వారీగా అంశాలను సమీక్షించారు. గ్రామసభకు అధికారులు,


సరుబుజ్జిలి : గ్రామసభలో మాట్లాడుతున్న మురళీమోహన్

పంచాయతీ పాలకవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం గమనార్హం. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బి.మల్లేశ్వరరావు. వార్డు మెంబర్లు సువ్వారి రాజేశ్వరరావు, బమ్మిడి గురువునాయడు, టిడిపి నాయకులు కోరాడ రాంప్రసాద్, ముడుదాన ఆనందరావు, మామిడి నారాయణరావు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న సంజీవరావు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక వెలుగు అసోసియేషన్ శిక్షణా కేంద్రం-బిలో ఉద్యానవన శాఖాధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస అధికారులు ఆదివాసీ రైతులతో సమాలోచన సమావేశం నిర్వహించారు. వెలుగు అసోసియేషన్ కార్యదర్శి బి.సంజీవరావు సమావేశం ప్రాముఖ్యతపై మాట్లాడుతూ కృషివిజ్ఞాన కేంద్రం అధికారులు, ఉద్యానవన శాఖాధికారులకు ఆదివాసీ రైతులకు అనుసంధాన కర్తగా ప్రకృతి వ్యవసాయం సాగు, సస్య రక్షణ, పోషన, ఉద్యానవన శాఖ చేసే కార్యక్రమాలను తెలియజేశారు. ఉద్యానవన శాఖాధి కారులు బి.అయంతి, హెచ్ఒ కుమారి, జయశ్రీ, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు రైతులకు అధిక ఆదాయం వచ్చే అంతర పంటలను వివరించారు. కృషి విజ్ఞానకేంద్రం అధికారి బాలకృష్ణ, పిషరిష్ సైంటిస్టు పశుపోషణ, గొర్రెలు, మేకలు, చేపలు పెంపకంపై వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సునీత పోషకాహార పంటలు, చిరు ధాన్యాలు, చిరుధాన్యాలు, వాటి ఉపయోగాలు, పెరటి తోటల పెంపకం, ఉపయోగాలు వివరించారు.

'ఐరీస్' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- రణస్థలం

ప్రేరణ ప్రోగ్రాం 2024లో భాగంలో స్థానిక ప్రైవేటు పాఠశాల ఐరీస్ సకల్య విద్యార్థి ఎల్.రూహాన్ సాయి ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ కె.హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, విద్యాశాఖ తలపెట్టిన ప్రేరణ ప్రోగ్రాం 2024లో భాగంగా మార్చి 2024న శ్రీకాకుళం జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రేరణ కార్యక్రమంలో ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడానికి సెప్టెంబర్ 1 నుంచి 7వరకు గుజరాత్‌లో వాద్‌నగర్‌లో జరిగే ప్రేరణ కార్యక్రమానికి హాజరు కావడానికి 9వ తరగతిలో జరిగిన ఎంపికలో రుహన్ సాయి ఎంపికైనట్లు జవహర్ నవోదయ



రూహన్ సాయికి అభినందనలు తెలుపుతున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

విద్యాలయ ప్రిన్సిపాల్ తెలిపారని పేర్కొన్నారు. మండల విద్యాశాఖాధికారి త్రినాథరావు ఐరిస్ సకల్య స్కూల్‌కు వచ్చి రూహాన్ సాయి, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ లెక్చరర్ మూర్తి, ప్రిన్సిపాల్ స్వాతి పద్మజ, కరస్పాండెంట్ విద్య, స్కూల్ ఉపాధ్యాయ బృందం రూహాన్ సాయికి అభినందనలు తెలియజేశారు.


మంత్రి అచ్చెన్నాయుడు కలిసిన నాయిబ్రాహ్మణులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కోటబొమ్మాళి: మండలం సరియాబొడ్డుపాడు పంచాయతీ బడ్డిపేటకు చెందిన టిడిపి నాయిబ్రాహ్మణ సాధికారిక కమిటి కన్వీనర్ పట్నాన భాస్కరరావు శుక్రవారం అమరావతిలో రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కలిసి వినతిపత్రం అందజేశారు. వైసిపి పాలనలో నాయిబ్రాహ్మణుల సంక్షేమం విస్మరించిందని వివరించారు. నాయీ బ్రాహ్మణులు అప్పన్న, కృష్ణరావు తదితరులున్నారు.


మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

మొక్కజొన్న సాగుపై అవగాహన

పొందూరు: మండలం దర్మపురంలో కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు మొక్కజొన్న పంటసాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.అనూష్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు సోకే కత్తెర పురుగు ఉధృతిని తగ్గించేందుకు లింగ ఆకర్షక బుట్టలు పెట్టి తల్లి రెక్కల పురుగులను ఆకర్షించి చంపాలని పేర్కొన్నారు. పంట సాగుకు సంబంధించి వివిధ పద్ధతులను సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, బి.భీమారావు, పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలి

ఇచ్ఛాపురం: ఇంకుడు గుంతలు వలన అనేక ప్రయోజనాలున్నాయని పంజావీధిలో ఉన్న మున్సిపల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు ఇంకుడు గుంతల వలన కలిగే ఉపయోగాలు, ఎలా ఏర్పాటు చేసుకోవాలో అవగాహన కల్పించారు. విద్యార్థులకు చదువుతో పాటు వివిధ సామాజిక అంశాలపై అవగాహన ఉండాలన్నారు. కిచెన్ గార్డెన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఇచ్ఛాపురం: మండలంలో మండపల్లి గ్రామ పంచాయతీ తోటూరులో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచి ప్రతినిధి పిట్టా మామయ్య, ఇఒ విష్ణు దగ్గరుండి పర్యవేక్షణ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టారు. కాలువలో మురికినీరు, బురద తొలగిస్తూ బ్లీచింగ్ పౌడర్ జల్లారు. అదే విధంగా ఈదుపురంలో కార్యదర్శి నీలపు శ్రీను ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విద్యుత్ ప్రమాదాలకు విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొన్ని ప్రాణాలు బలైపోతున్నాయి. చేరివీధి నాలుగురోడ్ల సమీపంలో ఒక భవనానికి కొత్త మీటర్ ఇచ్చినందుకు ఎల్‌టి విద్యుత్ వైర్లు గోడకు మేకులు కొట్టి విద్యుత్ మీటరు ఇచ్చారు. అయితే కొంతమంది విద్యుత్ సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి అసంపూర్తిగా విద్యుత్ వైర్లు అమర్చడం వలన ఎటువంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో ఆ సమీపంలో భవన నిర్మాణం జరుగుతుండగా విద్యుత్ వైర్లు తగిలి ఒక నిండు


గోడకు వేలాడదీసిన విద్యుత్ వైరు

ప్రయాణం బలైపోయింది. అయినప్పటికీ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తి పనులను చేసిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

విద్యార్థికి పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి- కొత్తూరు

10వ తరగతి ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలో జెడ్‌పిహెచ్ఎస్ నివగాం స్కూల్ టాపర్ కుంచాల కౌముది రంజితకు పురస్కారం ప్రధానం చేశారు. హెచ్ఎం సువ్వారి నిర్మల అధ్యక్షతన, పాతపట్నంనకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. 2023-24 విద్యా సంవత్సరంలో కౌమది రంజిత 575/600 మార్కులు సాధించారు. వీరికి రామరాజు అభినందన పురస్కారం, నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికను జి.జె.కాలేజ్ ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కష్టపడితే నష్టపోయేదేమీ లేదని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కుంచాల మల్లిఖార్జునరావు దంపతులు, నిలురౌతు ఆనందరావు, ఆదినారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరజాడ విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పాఠశాల హెచ్ఎం ఎల్.వెంకటరావు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరజాడలో శిక్ష సప్తహ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు పాఠశాల విద్యార్థులతో నైపుణ్యాల అభివృద్ధి, సాంకేతిక అభివృద్ధి అనే అంశంపై విద్యార్థులు వివిధ నైపుణ్యాలకు సంబంధించి ప్రదర్శనలు చేశారు. ప్రథమ చికిత్స, పాముకాటు, సిపిఆర్, సెల్‌ఫోన్ వినియోగం, నష్టాలు తదితర అంశాలపై సందేశాత్మక లఘు నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జిగా ఎల్‌వి చలం,



టి. శ్రీనివాసరావు వ్యవహరించారు. కార్యక్రమంలో కె.శ్రీరాములు, టి.గోపాలకృష్ణ, ఎస్.గణేష్ కుమార్, సిహెచ్ యతి రాజారావు, కె.రామారావు, సిహెచ్ ఆదినారాయణ, బాలరాజు, అర్జునుడు, బుడ్డ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి- పొందూరు

మండలం తండ్యాం పంచాయతీలో సర్పంచ్ కిల్లాన అప్పల నారాయణమ్మ పర్యవేక్షణలో దోమల నివారణ చర్యలను చేపట్టారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు తలెత్తే అవకాశం ఉంది. దీంతో దోమల నివారణ చర్యల్లో భాగంగా వీధుల్లోను, కాలువల్లోను, అపారిశు


దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ధ్య ప్రదేశాల్లో ఫాగింగ్ చేశారు. సచివాలయం సిబ్బంది సెక్రటరీ ఎస్.శంకరరావు, పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జె.ఆర్.పురం సిఐ జి.రామచంద్రరరావు, ఎస్ఐ.కె.గోవిందరావు ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి, ఆల్కాహాలు, సిగరెట్, గుట్కాలను అలవాటు చేసుకోవడం వలన విద్యార్థుల జీవితలు నాశనమవుతాయన్నారు. విద్యార్థులు విద్యపై శ్రద్ధ వహించి ఉన్నతమైన చదువును ఆభ్యసించి తల్లిదండ్రుల కోరికలను నెరవేర్చాలన్నారు. మీరు జీవితంలో అనుకున్న గమ్యాన్ని చేరాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మంద లించారని పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని విద్యార్థులు క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే విద్యార్థులు ద్విచక్రవాహనాలపై ర్యాస్ డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాతపట్నం: అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న గంజాయి,


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుట్కా, ఖైనీ వ్యాపారాన్ని అరికట్టాలని స్థానిక బస్టాండ్ వద్ద ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సాయి, సబ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ యాసిన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు అరికట్టడంలో విద్యార్థులు, యువకులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి బస్సులు, ఆటోల ద్వారా మత్తు పదార్థాల రవాణా జరుగుతుందని అధికారులు, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు వెంకటరావు, వాసు, కిరణ్మయి విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న బహిరంగ మలవిసర్జన రహిత గ్రామ సర్వే, పంచాయతీ యాప్-1 సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు అన్నారు. మండలం లొద్దభద్ర, అల్లుకోల, తర్లకోట పంచాయతీల్లో శుక్రవారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా రిసోర్స్ పర్సన్ పేరాడ ఆనందరావుతో కలిసి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 16 పంచాయతీల్లో సర్వే పూర్తికాగా అల్లుకోల, తర్లకోట, లొద్దభద్ర పంచాయతీల్లో సర్వే పూర్తి కాలేదన్నారు. సర్వే సమయంలో ప్రతి ఇంట్లో మరుగు దొడ్లు ఉన్నాయా లేవా, ఉంటే వినియోగంలో ఉన్నాయా లేవా, గ్రామాల్లో సాముహిక మరుగు దొడ్లు ఉన్నాయా లేవా, చెత్త సంపద


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి అప్‌లోడ్ చేస్తున్న అధికారులు

కేంద్రాలు పని తీరు ఎలా ఉంది తదితర అంశాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. పంచాయతీ రాజ్ యాప్-1లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు శుభ్రం చేయడం, మంచినీటి పథకాలు శుభ్రం, గ్రామాల్లో ఉన్న నీటి గుంటలను గుర్తించి వాటిని తొలగించి తిరిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆయనతో పాటు కోరాడ కరుణకుమార్, కార్యదర్శులు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు నియమనిబంధనలు పాటించాలని సిఐ వాయునందన్ దివాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శారద కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రయాణికుల భద్రత ఆటో డ్రైవర్ల చేతిలోనే ఉంటుందని నిదానంగా వాహనాన్ని నడపాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపవద్దని సూచించారు. గంజాయిని రవాణా చేసినా, ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తించినా సహించేది లేదని



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ

ఫోక్సో కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే లైసెన్సును రద్దు చేసి జైలు శిక్ష తప్పదని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుధాకర్


మైనర్ల డ్రైవింగ్‌తో ప్రమాదాలు

శ్రీకాకుళం అర్బన్: మైనర్ల డ్రైవింగ్‌తో ప్రమాదాలు పెరుగుతున్నాయని రెండో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు కళాశాలల యాజమాన్యాలకు, విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు బాధ్యత వహించాలన్నారు. కళాశాలలకు హాజరైన విద్యార్థులు బయటకు వెళ్లకుండా కళాశాల సమయంలో రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారులు

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కోటబొమ్మాళి: వివిధ స్వచ్ఛంధ సంస్థలు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలం చౌదరి కొత్తూరులో ఇంటాస్ ఫార్మాస్యూటికల్స్ సౌజన్యంతో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 112 తెల్లజాతి పశువులకు, లంపి స్కిన్ వ్యాధి నివారణా టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ మందా లోకనాథం, పారా సిబ్బంది ముకుంధరావు, నారాయణరావు, బాలకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అప్పలనాయుడును పరామర్శిస్తున్న సాయికుమార్ తదితరులు

అప్పలనాయుడుకు పరామర్శ

లావేరు: మండలంలో అధపాక మాజీ సర్పంచ్, వైసిపి సీనియర్ నాయకులు గొర్లె అప్పలనాయుడును శుక్రవారం రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టి.సీతారాం పరామర్శించారు. అప్పలనాయుడుకు ఇటీవల మోకాలు శస్త్రచికిత్స జరిగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మండల ప్రజాప్రతినిధులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైసిపి మండల అధ్యక్షుడు పెద్ద రామినాయుడు, సర్పంచ్‌లు రెడ్డి విశ్వరరావు, గొర్లె అప్పలనాయుడు, బొమ్మలాట శ్రీరాము, ఎంపిటిసి చిన్న రామినాయుడు, అధపాక సర్పంచ్ గొర్లె శశికళ, ప్రభాకర్ నాయుడు తదితరులున్నారు.

కెజిబివి హాస్టల్ పరిశీలన

కొత్తూరు: మండల పరిషత్ ఉపాధ్యక్షులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఏర్పాటవుతున్న కెజిబివి 4వ టైపు హాస్టల్‌ను సందర్శించి గదులను పరిశీలించారు. ఆయనతో పాటు హెచ్ఎం ఎ.గోవిందరావు, జెఇ బుచ్చిబాబు, పడాల వెంకట కృష్ణ, వార్డెన్ ఉమాశంకర్ ఉన్నారు.


హాస్టల్ గదులను పరిశీలిస్తున్న తులసీవరప్రసాదరావు